
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



3 సిద్దిపేట
సోమవారం 8 సెప్టెంబరు 2025

ప్రతి ఉద్యోగికీ ఒక మొక్క...

- భవిష్యత్ తరాల భద్రతకు మెగా ప్లాంటేషన్
- 'ఏక్ పేడ్ మాకే నామ్' స్ఫూర్తితో ఈ కార్యక్రమం
- 9న జిల్లాలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): "ఏక్ పెడ్ మా కె నామ్" (తల్లి పేరున ఒక మొక్క) పెంచాలనే కార్యక్రమ స్ఫూర్తితో జిల్లాలో ఈనెల 9న వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మంగళవారం ఉదయం ప్రతి ఉద్యోగితో ఒక మొక్కను నాటించేందుకు అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తోంది.


13,900 మంది ఉద్యోగులు

భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే ఉద్దేశంతో మొక్కల పెంపకం కార్యక్రమంలో జిల్లాలోని 13900 ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొననున్నారు. ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలోని నర్సరీలలో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ముందుగా గుర్తించిన ప్రదేశాల్లో గుంతలు తవ్వించి మొక్కలు నాటే కార్యక్రమం సజావుగా జరిగేలా జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపాలిటీలలో ఆయా మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. తల్లి పేరున నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా ఆ ఉద్యోగులే తీసుకోవడం విశేషం.



ప్రతీ ఉద్యోగి పాల్గొనాలి: కలెక్టర్

వన మహోత్సవంలో భాగంగా "ఏక్ పెడ్ మా కె నామ్" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ నెల 9న నిర్వహించే మెగా ప్లాంటేషన్ కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. కార్యక్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలి.



గణేశ్ నిమజ్జన వేడుకల్లో జగ్గారెడ్డి జోష్

రూ.18 లక్షలకు చైతన్య యూత్ లడ్డు దక్కించుకున్న జయాచైతన్యరెడ్డి

ఇటు ట్రాఫిక్ నియంత్రణ.. అటు మహబూబ్‌సాగర్ కట్టపై నిమజ్జనంలో తెల్లవారుజాము వరకు జగ్గారెడ్డి బిజీబిజీ

సంగారెడ్డి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో జరిగిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జోష్ కనబరిచారు. స్వయంగా దగ్గరుండి నిమజ్జన వేడుకలను పర్యవేక్షిస్తూ పట్టణంలో ట్రాఫిక్‌జాం కాకుండా చర్యలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటల వరకు మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై వినాయక విగ్రహాల నిమజ్జనాలను పర్యవేక్షించారు. జగ్గారెడ్డి కూతురు జయాచైతన్యరెడ్డి దంపతులు స్థానిక చైతన్యయూత్ లడ్డూ వేలంలో రూ. 18లక్షలకు దక్కించుకొని అక్కడికక్కడే భక్తులకు పంచారు.





రేపటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 9 నుండి 12 వరకు పలు విభాగాల్లో పోటీలు, ఎంపికలు చేపట్టనున్నారు. 9న అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో ఖోఖో పోటీలు, ఎంపికలు, అండర్ 14 అండర్ 17 బాలుర విభాగం వాలీబాల్ పోటీలు, ఎంపికలు చేపట్టనున్నారు. 10న అండర్ 14, అండర్ 17 బాలికల వాలీబాల్, అండర్ 14 అండర్ 17 బాలుర ఖోఖో పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నారు. 11న అండర్ 14 అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు, ఎంపికలు ఉంటాయి. 12న అండర్ 14, అండర్ 17 బాలురు, అండర్ 17 బాలికల విభాగంలో క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. ఈ పోటీలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానం, క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్ జీరాక్స్ మండల ఎంపిక జాబితాతో రావాలని ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ. సౌందర్య తెలిపారు.

మందుల పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

- చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి
- వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

5

రేషన్ బ్యాగులొస్తున్నాయ్

కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు త్వరలో మరో శుభవార్తను వినిపించనుంది. పర్యావరణహితమైన ప్రత్యేక బ్యాగులను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ బ్యాగులు ఇప్పటికే జిల్లాలోని గోదాంలకు చేరుకున్నాయి. అయితే, ఈ బ్యాగులతో పాటు గతంలో మాదిరిగా నిత్యావసర వస్తువులను కూడా అందిస్తారా అనే ఆసక్తి రేషన్ డీలర్లు, ప్రజల్లో నెలకొన్నది. దసరా కానుకగా ఈ పంపిణీ ఉంటుందని అంతా ఎదురుచూస్తున్నారు.

- చేతి సంచులతో నిత్యావసరాలు?
- త్వరలో పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- రేషన్ డీలర్లకు రెట్టింపు లాభం
- గోదాంలకు చేరిన సంచులు
- పర్యావరణ హితంగా బ్యాగుల రూపకల్పన

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తూ ప్రజలకు చేరువైన ప్రభుత్వం, ఇప్పుడు మరో కానుకను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సుమారు 3.35లక్షల రేషన్ కార్డులున్నాయి. వీరికి అందించాల్సిన బ్యాగులు ఇప్పటికే జిల్లా కేంద్రంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్లకు (గోదాం) చేరుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఈ సంచులను రేషన్ డీలర్లకు పంపిణీ చేసి, అక్కడి నుంచి కార్డుదారులకు అందజేయనున్నారు. ఈ బ్యాగులను ప్రత్యేకంగా పర్యావరణహితంగా తయారు చేశారు. వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాలతో పాటు, అందరికీ "సన్నబియ్యం ప్రజాప్రభుత్వం తోనే సాధ్యం" అనే నినాదాన్ని కూడా ముద్రించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని అధికారులు చెబుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పౌరసరఫరాల శాఖ శకటంలో ఈ బ్యాగులను ప్రదర్శించారు. వర్షాకాలం దృష్ట్యా బియ్యం నిల్వ, రవాణా ఇబ్బందుల వల్ల జూన్‌లోనే మూడు నెలల రేషన్ (జూన్, జూలై, ఆగస్టు)ను కార్డుదారులకు పంపిణీ చేశారు. సెప్టెంబరులో రేషన్‌తో పాటు బ్యాగులను ఇవ్వాలని అనుకున్నా అది అమలు కాలేదు. ప్రస్తుతం గోదాముల్లో బ్యాగులు నిల్వ ఉన్నాయి. రాబోయే దసరాకు కానీ, వచ్చే నెల రేషన్‌తో కానీ వీటిని పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రతి కార్డుకు ఒక సంచి ఇస్తారా? లేక కార్డులో ఉన్న ప్రతి వ్యక్తికి ఇస్తారా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.



ప్రభుత్వం అందించనున్న రేషన్ బ్యాగు


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సివిల్ సప్లయ్ శకటంలో బ్యాగు ప్రదర్శన

గతంలో అమ్మహస్తం

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమ్మహస్తం, మన బియ్యం పేరుతో బియ్యం, కిరోసిన్‌తో పాటు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వాటిని తీసుకెళ్లడానికి చేతి సంచిని కూడా ఇచ్చారు. కందిపప్పు, చింతపండు, చక్కెర, గోధుమలు, గోధుమ పిండి, కారం, పసుపు పొడి, పామ్ ఆయిల్, ఉప్పు ప్యాకెట్లను నెలకు రూ.185కే అందించేవారు. తాజాగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సన్నబియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం చేతి సంచులు అందుబాటులోకి రావడంతో,

మిగతా 6వ పేజీలో

సజావుగా ముగిసిన నిమజ్జనోత్సవాలు

- సీపీ అనురాధ



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమం ముగిసిందని సీపీ అనురాధ తెలిపారు. సమష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది, వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులు, వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులను అభినందించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖలు సమన్వయంగా పనిచేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. 11 రోజులపాటు 24 గంటలు పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి వల్లే ఉత్సవాలు విజయవంతంగా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



ములుగు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఎవరు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బండమైలారం సీడ్‌పార్కు వద్ద గంజాయి అమ్ముతున్న వ్యక్తిని నమ్మదగిన సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. బీహార్‌కు చెందిన దిలీప్ కుమార్ ముఖియా అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా అతని నుంచి 156 గ్రాముల గంజాయి, ఒక టీవీఎస్ అపాచీ బైక్ (టీజీ08 6504) రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

కల్యాణం నాటికి క్యూ కాంప్లెక్స్ పూర్తవ్వాలి

కొమురవెల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ఆదివారం ఆలయ ఈవో టంకశాల వెంకటేష్ పరిశీలించారు. అధికారులతో, కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. వచ్చే కల్యాణం నాటికి క్యూ కాంప్లెక్స్ భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

గజ్వేల్ ప్రెస్‌క్లబ్.. పీపుల్స్ క్లబ్

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

గజ్వేల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రెస్‌క్లబ్ పీపుల్స్ ప్రెస్‌క్లబ్ అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను, అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ఉద్యమంలో కీలకపాత్ర పోషించే విధంగా కృషి చేయడంలో గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. జర్నలిస్టుల కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు వివరించారు. రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ఈహెచ్‌ఎస్ ఏర్పాటుకు అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్‌రావు చెప్పారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజల భావాలను తెలిపేది విలేకరులే: శ్రీనివాస్‌రెడ్డి

ప్రజల భావాలను తెలిపేదే విలేకరులేనని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని చెప్పారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలకు పురుడు పోశారని గుర్తు చేశారు. మెదక్‌లో జర్నలిస్టు యాదగిరిని హత్య చేయగా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని పోరాటం చేస్తే అప్పటి సీఎం చంద్రబాబు స్పందించారని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. 10లక్షల పరిహారం అందించడంలో ఉమ్మడి మెదక్ జిల్లా జర్నలిస్టుల ఐక్యత గొప్పదన్నారు. వారంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జీవో రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని తెలిపారు. అనంతరం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. సమాజానికి ఎంతో కొంత మంచి చేయాలని తపన ఉన్నవారు మాత్రమే జర్నలిజం వృత్తిలోకి రావాలన్నారు. ప్రస్తుతం పుట్టగొడుగుల్లా వందల్లో యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా రావడంతో నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు గౌరవం దక్కడం లేదన్నారు.


మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్ ప్రెస్‌క్లబ్ భిన్నం: విరాహత్ అలీ

రాష్ట్రంలో ఎన్నో ప్రెస్‌క్లబ్‌లు ఉన్నా గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. కొంతమంది జర్నలిజం విలువలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, వారిపై రకరకాలుగా గజ్వేల్ ప్రెస్ క్లబ్‌పై బురద జల్లడం, ఐక్యతలో విచ్ఛిన్నం తేవడానికి కొన్ని శక్తులు కుట్ర పడ్డాయని, ఆ శక్తులకు ఈ రోజు జరుగుతున్న సభ, మేము తెచ్చిన సావనీర్, కాలం పోరు పుస్తకమే సమాధానమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బట్టు దయానందరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, స్థానిక విలేకరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలోని ఆలయం వద్ద సంపూర్ణ చంద్రగ్రహణ దృశ్యాలు - సిద్దిపేట ఫొటోగ్రాఫర్


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

మెనూ పాటించాలి

- కలెక్టర్ హైమావతి

కొండపాక సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆహార పదార్థాలతో పాటు కామన్ మెనూ పాటించి విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. ఆదివారం సాయంత్రం కొండపాక మండల పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. భోజనం ఎలా ఉంది, బాగా పెడుతున్నారని విషయాలు ఆరా తీశారు. వంట గది వెనకాల డ్రైనేజీ వ్యవస్థ చెడిపోవడంతో దుర్వాసన వస్తున్నట్లు గమనించి త్వరలోనే బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు.

తప్పని ట్రాఫిక్ తిప్పలు

- వాహనదారులకు, పాదచారులకు కష్టాలు
- జాతీయ రహదారి అయినా..

హుస్నాబాద్‌లో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

హుస్నాబాద్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. జాతీయ రహదారిగా మారినా ట్రాఫిక్ సమస్యలు మాత్రం తగ్గడం లేదు. వాహనాలను రోడ్లపైన ఇష్టానుసారంగా నిలపడం, అలాగే పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో అంబేడ్కర్ చౌరస్తాలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి సబ్ కంట్రోల్ రూమ్ ఉండేది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దాన్ని తొలగించారు. గతంలో ప్రధాన కూడళ్లలో పోలీసు సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించేవారు. కానీ ఇప్పుడు పోలీసుల పర్యవేక్షణ కరువైంది. ముఖ్యంగా ప్రతి శుక్రవారం జరిగే వారపు సంత రోజు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజు హుస్నాబాద్‌కు వేలాది మంది ప్రజలు వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మల్లె చెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, నాగారం రోడ్డు, అక్కన్నపేట రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ పూర్తిగా లేకుండా పోయింది. హుస్నాబాద్ పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే అంగడికి చుట్టుపక్కల వంద గ్రామాల ప్రజలు వస్తుంటారు. కూరగాయల అంగడి జరిగే రామవరం-అక్కన్నపేట బైపాస్ రోడ్డులో రద్దీ ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా తీసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ప్రతి శుక్రవారం పదుల సంఖ్యలో సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకు వద్ద నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. బ్యాంకుకు వచ్చే కస్టమర్లకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తుందని త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుమీదే నిలిపిన వాహనాలు


నర్సాపూర్‌లోని పోస్టాఫీసు సమీపంలో ఉన్న పాఠశాలలో నేర్చుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ బడుల్లో ఏఐ బోధన

మెదక్ జిల్లాలో ఆరు పాఠశాలల్లో ప్రారంభం

మెదక్/నర్సాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే సాంకేతిక విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో మెదక్ జిల్లాలో మొత్తం 21 పాఠశాలలను ఎంపిక చేయగా, మొదటి విడతలో ఆరు పాఠశాలల్లో ఈ బోధనను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రస్తుతం నర్సాపూర్, తూప్రాన్, కాళ్లకల్, బూర్గుపల్లి, నిజాంపేట, మాసియపేట పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ విద్యను అందిస్తున్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి

విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఏఐ బోధన కొనసాగుతోంది. వారానికి నాలుగు రోజులు ఏఐ ద్వారా డిజిటల్ లిటరసీ, తెలుగు, గణితం వంటి అంశాలపై కంప్యూటర్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. నర్సాపూర్‌లోని పోస్టాఫీసు సమీపంలోని పాఠశాలలో బెంగుళూరుకు చెందిన ఈకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ బోధన పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, గతంలో బడికి రావడానికి ఇష్టపడని వారు ఇప్పుడు ఉత్సాహంగా వస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు.

కోహీర్ పట్టణం.. అభివృద్ధికి దూరం

- ముున్సిపాలిటీగా మారినా తీరని కష్టాలు
- రెగ్యులర్ కమిషనర్ లేక అస్తవ్యస్తం
- అధ్వానంగా మురుగు కాలువలు, బురదమయంగా రోడ్లు


కోహీర్‌లోని జహంగీర్‌వాడ కాలనీలో మట్టి రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

కోహీర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీగా మారితే తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని కోహీర్ ప్రజలు ఆశించారు. జనవరి 27న కోహీర్‌ను ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. కానీ, పూర్తిస్థాయి అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు ప్రభుత్వం, అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలసత్వంపై విమర్శలు

మున్సిపాలిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్‌ను నియమించకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పటివరకు నలుగురు ఇన్‌చార్జి కమిషనర్లు వచ్చినా, ఎవరూ కొన్ని నెలలకు మించి విధులు నిర్వహించకుండా బదిలీలపై వెళ్లిపోయారు. ప్రస్తుతం జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఆయన సమయానికి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

పట్టణంలో సమస్యల తిష్ట

కోహీర్ పట్టణంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో వీధిలైట్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అలాగే, తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అధికారుల అలసత్వంతోనే

స్థానిక నాయకులు, ప్రజలైన ఎంఏ. ఖలీమ్, ఫిర్దోస్ మున్సిపాలిటీ సమస్యలపై స్పందించాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. కోహీర్ అభివృద్ధి కోసం వెంటనే రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. అధికారుల అలసత్వం వల్ల ప్రజలు నిరాశ చెందుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




మరమ్మతులకు నోచని నిజాంపేట-నస్కల్ రహదారి, రామాయంపేట - నిజాంపేట హైవేలోని రోడ్డు క్లోజ్ అని పోసిన మట్టి

మరమ్మతులేవి?

- వరదలకు తెగిన రోడ్లు, కల్వర్టులు
- రామాయంపేట, నిజాంపేట మండలాల్లో సమస్యలు
- పనుల జాప్యంతో పరేషాన్
- అంతర్ జిల్లా సరిహద్దు వాసులకు తప్పని కష్టాలు

రామాయంపేట/నిజాంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లు, కల్వర్టుల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పనుల్లోని నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అత్యవసరాల కోసం అధిక దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

తెగిపోయిన కల్వర్టులు, రోడ్లు

రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని నస్కల్, పర్వతాపూర్, చల్మెడ, దర్మారం, లక్ష్మాపూర్ స్టేషన్ రోడ్లపై ఉన్న కల్వర్టులు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. పన్నెండు రోజుల క్రితం వరదలకు దెబ్బతిన్న ఈ రోడ్ల మరమ్మతులు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దు వాసులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా నిజాంపేట - నస్కల్ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, కూలీలు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చల్మెడ - నిజాంపేట పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. అదేవిధంగా రామాయంపేట మండల పరిధిలోని పర్వతాపూర్‌కు వెళ్లే రహదారి కల్వర్టు తెగిపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు, తండావాసులు పట్టణాలకు వెళ్లలేకపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ ప్రాంతాలను పర్యవేక్షించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. రోడ్డు కృంగిపోయి క్లోజ్ చేసిన నిజాంపేట మండలంలోని 765 డీజీ హైవేపై కూడా వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు పనులు పూర్తి చేసి, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని రామాయంపేట, నిజాంపేట మండలాల ప్రజలు కోరుతున్నారు.


రామాయంపేట-నిజాంపేట మధ్యలో కుంగిన రోడ్డుపై వాహనదారుడి తిప్పలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- జోగిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు
- గిరిపల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలుడు
- చేగుంటలో కారు చెట్టును ఢీకొనడంతో యువకుడి దుర్మరణం




బైకును ఢీకొన్న కారు, మృతిచెందిన నర్సింలు(ఇన్‌సెట్‌లో), గిరిపల్లిలో సంఘటన స్థలంలోనే మృతి చెందిన హర్షిత్

జోగిపేట/గజ్వేల్ రూరల్/చేగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వృద్ధుడు, బాలుడు, యువకుడు మృతి చెందగా, నలుగురికి గాయాలైన ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సంగూర్‌పేట వద్ద 161 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సింగూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు (60) తన కుమారుడు బాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో, గజ్వేల్ మండలం గిరిపల్లిలో రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన జలా హర్షిత్ (10) గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. హర్షిత్ తన తల్లిదండ్రులతో కలిసి గిరిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ శివారులో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రామాయంపేట మండలం శివాయపల్లి గ్రామానికి చెందిన కుటుంబం చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం విందు నిర్వహించుకున్నారు. రాత్రి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా అనంతసాగర్ శివారులో ప్రమాదవశాత్తు కారు చెట్టుకు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రామోల్లా సాయితేజగౌడ్(23) తీవ్రంగా గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పల్లె స్వామి, గుర్రం తేజగౌడ్, పెండల ప్రణయ్, చాకలి నరేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఘటన స్థలానికి పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సురేష్(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం హుస్నాబాద్ పరిధిలో చోటుచేసుకున్నది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన నమిలికొండ సురేష్ (28) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల భార్య అనారోగ్యం కారణంగా చికిత్స కోసం రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆటో ద్వారా ఆదాయం లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే దిగులుతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనికి వెళ్లిన భార్య రమాదేవి ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సురేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేయిస్తున్న బుంగ

వెంకట్రావ్‌పేటలో బుంగ పడిన వనం చెరువు

తొగుట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తొగుట మండలం వెంకట్రావ్‌పేటలోని వనం చెరువు మత్తడి వద్ద శనివారం సాయంత్రం బుంగ పడింది. దీంతో నీరు వృథాగా పోతుండగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గడ్డికట్టలు వేసినప్పటికీ నీటి ప్రవాహం ఆగలేదు. దీంతో జేసీబీని తెప్పించి, రైతులు, లస్కర్‌ల సహాయంతో మట్టి, గడ్డికట్టలతో బుంగను పూడ్చివేశారు.



సిద్దిపేట కోమటిచెరువులో నిమజ్జనమవుతున్న గణపయ్య



రామాయంపేటలో



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్‌లో చివరి వినాయకుడి నిమజ్జనం

బై బై గణేశా

రెండో రోజు సందడి.. మధ్యాహ్నం తర్వాత ముగిసిన నిమజ్జనం

జహీరాబాద్/సంగారెడ్డి/సిద్దిపేట/దుబ్బాక/రామాయంపేట/మనోహరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో పదకొండు రోజులు పూజలందుకున్న గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక నిమజ్జనాలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. శనివారం సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్రలు ధగధగలాడే విద్యుత్‌కాంతుల అలంకరణ, డప్పుచప్పుల దరువుతో సందడిగా సాగాయి. చిన్నాపెద్ద, యువత చిందుల మధ్య అర్ధరాత్రి తర్వాత ప్రధాన రోడ్లపైకి చేరుకోగా, ఆదివారం ఉదయం నిమజ్జనానికి బారులు తీరాయి. జహీరాబాద్‌లో నారింజ ప్రాజెక్టులో 50 విగ్రహాలు నిమజ్జనమయ్యాయి. సంగారెడ్డిలో మధ్యాహ్నం వరకు కొనసాగగా, మహబూబ్‌సాగర్ చెరువులో సుమారు 148 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. రామాయంపేట, మనోహరాబాద్‌లలో రెండో రోజు హంగామాగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. దుబ్బాకలో మధ్యాహ్నం వరకు నిమజ్జనం పూర్తికాగా, సిద్దిపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం వరకు సాగింది. కోమటిచెరువు, ఎర్రచెరువుకు మధ్యాహ్నం తర్వాత విగ్రహాల వాహనాలు వరుస కట్టాయి. క్రేన్‌ల సహాయంతో ఒక్కో విగ్రహాన్ని నిమజ్జనం చేసే వరకు సాయంత్రమైంది. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. సిద్దిపేట పట్టణంలో పలు చోట్ల విగ్రహాలను ఇంకా గణనాథులకు ఉద్వాసన పలకలేదు. ఆదివారం రాత్రి గ్రహణం ఉండడంతో ముందే కలశం మాత్రమే కదిలించి, మండపాలకు నల్లటి పరదాను కప్పి ఉంచారు.

లడ్డూలకు రికార్డు ధరలు

నారాయణఖేడ్/తూప్రాన్/కల్హేర్/సిర్గాపూర్/తొగుట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటల్లో భక్తులు పోటీపడి రికార్డు స్థాయి ధరలకు దక్కించుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని సాయినగర్ కాలనీలో స్టార్ వార్స్ వినాయకుడి లడ్డూ వేలం పాటలో పల్లెర్ల బాలేశ్‌గుప్తా రూ.1.95 లక్షలకు దక్కించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం వినాయకుడి లడ్డూను నాగిళ్ల రాజు రూ. 1.41 లక్షలకు పొందారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని హిందుసేన గణేష్ లడ్డూను మెడికల్ వ్యాపారి సంతోష్ వరుసగా 17వ సారి రూ.1,71,116లకు సొంతం చేసుకున్నారు. సిర్గాపూర్‌లో సాయి గణేష్ యువజన సంఘం ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూను ప్రవీణ్‌గౌడ్ రూ.లక్ష సొంతం చేసుకున్నాడు.



సిద్దిపేటలో నిమజ్జనానికి వరుస కట్టిన వినాయక వాహనాలు



జహీరాబాద్‌లో నారింజ ప్రాజెక్టులో నిమజ్జనమవుతున్న గణపయ్య



నారింజ ప్రాజెక్టుకు నిమజ్జనానికి తరలిన జహీరాబాద్ విగ్రహాలు







దుబ్బాకలో ఆదివారం తెల్లవారుజామున వినాయక శోభాయాత్ర సందడి

దుబ్బాకలో చెరువు కట్ట వద్దకు నిమజ్జనానికి వరుసలో వినాయక వాహనాలు



సిద్దిపేటలో నిమజ్జనం చేయకుండా టార్పాలిన్ కట్టిన మండపం



మనోహరాబాద్ మండలం దండుపల్లిలో నిమజ్జనానికి తరలిన గణపతి

మెదక్‌లో నిమజ్జనానికి తరలిన పిట్లంబేస్ వీధి గణనాథుడు



కోమటిచెరువులో క్రేన్‌లతో గణపతి నిమజ్జనం

సర్కారు బడుల్లో మళ్లీ రాగిజావ

● నేటి నుంచి పంపిణీ షురూ



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు మరింత పౌష్టికాహారాన్ని అందించేందుకు గత ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పీఎం పోషన్ పథకం ద్వారా రాగిజావ పంపిణీ చేశారు. అయితే, గత విద్యా సంవత్సరం ఏప్రిల్ వరకు విద్యార్థులకు రాగిజావను అందించినప్పటికీ, ఈ విద్యా సంవత్సరం నుంచి మాత్రం అమలుకు నోచుకోలేదు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అందాల్సిన రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు ఇంకా సర్కారు బడులకు సరఫరా కాలేదు. తాజాగా రాగిజావ మళ్లీ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 8 వ తేదీన(నేటి)నుంచి రాగి జావ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.

రాగిజావ, బెల్లంపొడితో ఎంతో ఉపయుక్తం

గతేడాది విద్యార్థులకు అందజేసిన రాగిజావ, బెల్లం పొడి పంపిణీకి శ్రీసత్య సాయి అన్నపూర్ణ ట్రస్టు చేయూతనిచ్చింది. వారంలో మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టని మూడు రోజుల్లో ప్రతీ విద్యార్థికి 10 గ్రాముల రాగి పొడి, 10 గ్రాముల బెల్లం పొడి కలిపిన జావను అందించారు. సాధారణంగా చాలా మంది పేద పిల్లలు ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలకు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారిలో ఎక్కువ మంది అల్పాహారం తీసుకోవడం లేదు. ఫలితంగా వారిలో రక్తహీనత, పోషకాహార లోపం కనిపిస్తుండటంతో పాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. చదువుపై కూడా ఏకాగ్రత చూపలేకపోతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని గతేడాది సర్కారు సంకల్పించింది.

పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో

సంగారెడ్డి జిల్లాలో 1215 సర్కారు బడుల్లో 103046 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాగిజావ పంపిణీతో విద్యార్థులకు ఎంతో ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నది. సోమవారం సంగారెడ్డి చౌరస్తాలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో రాగిజావ పంపిణీ ప్రారంభించనున్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

● పట్టపగలే ట్రాక్టర్లలో దర్జాగా తరలింపు



మల్లారం శివారులో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

చిన్నకోడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలో ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా, పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా మల్లారం గ్రామ శివారులోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల అలసత్వంపై విమర్శలు

వాగుల నుంచి ఇష్టానుసారంగా ఇసుకను తవ్వుతున్నా, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇసుకకు డిమాండ్ పెరగడంతో, అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ప్రకృతి సంపదను దోచుకోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, బావులు, బోర్లు ఎండిపోయి వ్యవసాయానికి నీటి సమస్య ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

మందుల పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

● చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి
● వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో రసాయన మందుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. విత్తనం విత్తినప్పటి నుంచి కోత దశ వరకు రైతులు విచ్చలవిడిగా రసాయన, కలుపు మందులను వాడుతున్నారు. అయితే ఈ మందుల వాడకంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే పంట దిగుబడి తగ్గడంతో పాటు, ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకూడదని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

రసాయన మందులు, కలుపు మందులు స్ప్రే చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపారు.

● చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించడం తప్పనిసరి. స్ప్రే చేస్తున్నప్పుడు కళ్లు, ముక్కు, నోటిని చేతులతో తాకడం లేదా రుద్దుకోవడం చేయకూడదు.

● గాలికి ఎదురుగా స్ప్రే చేయకూడదు. మొక్కలకు కింది, పై భాగం పూర్తిగా తడిచేలా స్ప్రే చేయాలి. ఉదయం గాలి లేని సమయం చూసుకుని స్ప్రే చేయడం మంచిది.

● స్ప్రే చేసే సమయంలో సిగరెట్లు, బీడీలు తాగడం లేదా గుట్కాలు తినడం వంటివి ఆరోగ్యానికి హానికరం. స్ప్రే చేయడం పూర్తయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కున్న తర్వాతే భోజనం చేయాలి.

● రసాయన ఎరువుల డబ్బాలను విచ్చలవిడిగా పడేయకూడదు. అలానే అందుబాటులో ఉండేలా ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉంచకూడదు.

● స్ప్రే చేసిన తర్వాత శరీరంపై దద్దుర్లు, కడుపులో నొప్పి, మంట వంటి సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అధిక మోతాదు ప్రమాదకరం

కలుపు నివారణ మందులు స్ప్రే చేసిన వెంటనే పురుగుల మందులు స్ప్రే చేయవద్దని అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే మోతాదుకు మించకుండా మందులను వాడాలని, అలా చేస్తేనే పంట దిగుబడి మెరుగ్గా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

ఆలయాల మూసివేత

● నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలు





సిద్దిపేట పట్టణంలో ఉమాపార్థివ కోటిలింగేశ్వర ముఖద్వారం మూసివేత, వెల్దుర్తి మండలం బస్వాపూర్‌లో మూసివేసిన మల్లికార్జున స్వామి ఆలయం

సిద్దిపేట/దుబ్బాక/పాపన్నపేట/చిలప్‌చెడ్/నారాయణఖేడ్/గుమ్మడిదల/వెల్దుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని ఆలయాలను మూసివేశారు. సిద్దిపేటలోని శ్రీఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయం, శ్రీశరభేశ్వరాలయం, వీరహనుమాన్, వెంకటేశ్వరాలయం, సంతోషిమాత ఆలయాలను మధ్యాహ్నం నుంచి మూసివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దుబ్బాకలోని వీరాంజనేయ, నీలకంఠేశ్వర, మార్కేండేయ, కేదారీశ్వర, బాలాజీ వేంకటేశ్వర, రేణుకాదేవి ఆలయాలకు తాళాలు వేశారు. మెదక్ జిల్లా ఏడుపాయలలో రాజగోపుర ఆవరణలోని అమ్మవారికి ఆదివారం మధ్యాహ్నం హారతినిచ్చి దర్శనాన్ని నిలిపివేశారు. చిలప్‌చెడ్ మండల పరిధి చిట్కుల్‌లోని చాముండేశ్వరిలో పూజల అనంతరం అర్చకులు ఆలయాన్ని మూసివేశారు. వెల్దుర్తిలోని బస్వాపూర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, మన్నెవారి జలాల్‌పూర్ కళామాత ఆలయాల గేట్లను వేశారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని బోరంచ పోచమ్మ ఆలయం, గుమ్మడిదల వీరభద్రస్వామి దేవస్థానంను మూసివేశారు. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత సోమవారం ఉదయం ఆలయాలను శుభ్రం చేసి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తిరిగి దర్శనం కల్పించనున్నట్లు ఆయా ఆలయాధికారులు, అర్చకులు తెలిపారు. భక్తులు ఈ విషయాలను గమనించి సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

కల్తీ దందా

పామాయిల్, పౌడర్‌తో కృత్రిమ పాల తయారీ

స్వచ్ఛతకు మారుపేరుగా భావించే పాలను కల్తీ చేస్తూ కొందరు స్వార్థపరులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. హైదరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి, జోగిపేట వంటి పట్టణ ప్రాంతాలకు పామాయిల్, టేస్టింగ్ పౌడర్‌తో తయారు చేసిన కృత్రిమ పాలు, నెయ్యిని వేల లీటర్ల మేర సరఫరా చేస్తున్నారు. పోలీసులు దాడులు నిర్వహించి కల్తీ వ్యాపారులను అరెస్టు చేసినా, జైలు నుంచి తిరిగి వచ్చి మళ్లీ అదే దందా కొనసాగిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కృత్రిమంగా తయారు చేసిన నెయ్యి డబ్బాలు (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం గోవిందరాజ్‌పల్లి గ్రామంలోని

పోలీసుల దాడుల్లో గుట్టురట్టు

జైలుకెళ్లినా తీరు మార్చుకోని నిందితులు

తిరిగి కల్తీ పాలు, నెయ్యి తయారీ మొదలు

మధుప్రియ డెయిరీ యజమానులు బొమ్మ శంకరయ్య, అతని కుమారుడు బొమ్మ రాఘవేందర్ కృత్రిమ పాలు, నెయ్యి తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పేరుకు డెయిరీ అయినా, లోపల ఉండేది పదుల సంఖ్యలోనే ఆవులు, బర్రెలు మాత్రమే. 200 లీటర్ల పాలతో 2500 లీటర్ల కల్తీ పాలను తయారు చేసి పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్ వంటి ప్రాంతాలకు సరఫరా చేసేవారు. గత సంవత్సరం ఏప్రిల్ 3న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, శంకరయ్య, రాఘవేందర్‌లను అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన రాఘవేందర్ తన పద్ధతిని మార్చుకోలేదు. మళ్లీ కల్తీ పాల తయారీని ప్రారంభించాడు. తాజాగా కల్తీ నెయ్యిని కూడా చేయడం మొదలు పెట్టాడు.

కల్తీ నెయ్యి తయారీ, అమ్మకాలు

తాజాగా ఆగస్టు 30న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మళ్లీ దాడులు చేసి కల్తీ నెయ్యి తయారీని గుట్టురట్టు చేశారు. పామాయిల్ ప్యాకెట్లు, కల్తీ నెయ్యి, పాల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను భారీగా స్వాధీనం చేసుకున్నారు. సరఫరాకు సిద్ధంగా ఉంచిన 16 డబ్బాల్లో ఉన్న 210 లీటర్ల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెయ్యిని హైదరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను మరోసారి అదుపులోకి తీసుకొని జైలుకు పంపారు.



కృత్రిమ పాలు తయారు చేయడానికి ఉపయోగించే ముడి పదార్థాలు (ఫైల్)

పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం



ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటివారైనా శిక్షార్హులే. కల్తీ వ్యాపారాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. లేదా డయల్ 100కు కాల్ చేయండి.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

అత్యవసర వైద్యసేవలు అందని ద్రాక్షేనా?

- కొమురవెల్లి మండలంలో పీహెచ్‌సీ ఉన్నా పరిమిత సేవలతో సరి
- వేలాదిగా తరలివచ్చే మల్లన్న భక్తులకు అందని కనీస వైద్యం
- పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మారిస్తే మండల ప్రజలతో పాటు మల్లన్న భక్తులకు ఎంతో మేలు



కొమురవెల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనుకోని సంఘటనలు, ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్యసేవలు అందించడానికి స్థానికంగా ఆసుపత్రి అందుబాటులో లేకపోవడంతో కొమురవెల్లి మండల ప్రజలతో పాటు, మల్లన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా సామాజిక ఆరోగ్య కేంద్రం మాదిరిగా అత్యవసర సేవలు అందించేందుకు అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు అందుబాటులో లేవు. ఫలితంగా మండలంలోని 11 గ్రామాల ప్రజలకు అత్యవసర సమయాల్లో ముఖ్యంగా రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి చేరుకోవాలంటే సుమారు 25కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో గంట సమయం పడుతుందని మండల ప్రజలు వాపోతున్నారు.

నిత్యం భక్తుల తాకిడి

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి చేరుకుంటారు. 3 నెలల జాతర సమయంలో ప్రతీ ఆదివారం సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకుంటారు. మిగతా సమయాల్లో కూడా ప్రతీ ఆదివారం సుమారు 10 వేల నుంచి 20 వేల మంది వరకు భక్తులు మల్లన్నను దర్శించుకుంటారు. ఇంత రద్దీగా ఉండే కొమురవెల్లి మండలకేంద్రంలో అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రి లేదు. కనీసం ప్రైవేట్ ఆసుపత్రి కూడా లేదు. దీంతో స్థానిక ప్రజలు, భక్తులు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సామాజిక ఆరోగ్యకేంద్రమే పెద్ద దిక్కు

ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సుమారు నెలకు 2,200 ఓపీ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో ఎక్కువగా కోతుల వల్ల గాయాలు, కుక్క కాట్లు, సీజనల్ వ్యాధుల కేసులు, బర్నింగ్ గాయాల కేసులు నమోదవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సేవలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే అందుతున్నాయి. ఆ తర్వాత ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలకు స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిని ఉంచుకొని ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని, ఫర్నీచర్, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చితేనే అత్యవసర సేవలు అందే అవకాశం ఉంది. ఆ దిశగా వైద్యారోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలతో పాటు మల్లన్న భక్తులు కోరుతున్నారు.

అత్యవసర వైద్యసేవలు అందించాలి



సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ఆసుపత్రిలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు మండల ప్రజలకు, మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించే ఆసుపత్రి లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం కోతులు, కుక్కల దాడులతో ప్రజలు గాయాలపాలవుతున్నారు. వెంటనే కొమురవెల్లిలో అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- కటకం అమరేందర్, కొమురవెల్లి వాసి

సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చుక్క రాములు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, పోటీ సెంటర్లను రద్దు చేయాలని కొత్త దరఖాస్తులు తీసుకోవడం ఆపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ అనుబంధ సంస్థ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీ ప్రైమరీ విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అప్పగించాలని, విద్యా వలంటీర్లను నియమించి వేతనాన్ని అదనంగా చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానం వలన ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వ్యవహరించకూడదన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు అదనపు బాధ్యతలను అప్పగించి ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించి ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించకపోతే అవసరమైతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ ఉపాధ్యక్షురాలు వీరమణి కళావతి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన



అనాజీపూర్ పాఠశాలలో గ్రంథాలయం కోసం పుస్తకాలను అందజేస్తున్న చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతినిధులు

రాయపోల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు తోడ్పడతాయని బాల చెలిమి, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమి చైర్మన్ వేదకుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయపోల్ మండలం అనాజీపూర్ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల వికాసానికి పుస్తకాలు మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తూప్రాన్/సంగారెడ్డి అర్బన్/కంది/రామాయంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320-డీ ఆధ్వర్యంలో దిల్ సే గురు వందం పేరుతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తూప్రాన్ లయన్స్‌క్లబ్ తరఫున ధనలక్ష్మిని ఎంపిక చేసి నామినేట్ చేశారు. ఎంపిక చేసిన క్లబ్ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, సెక్రటరీ సీఆర్ జానకీరాం, ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అలాగే సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెల్టూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పత్తిగారి మల్లికార్జున్‌గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రవీంద్రభారతిలో అందుకున్నారు. కంది మండలం ఎద్దుమైలారం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో జోగప్పను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాజీ ఐఏఎస్ కే.లక్ష్మీనారాయణ జోగప్పను సన్మానించారు. రామాయంపేట ప్రాంతానికి చెందిన నార్సింగి మండల పరిధి జప్తి శివనూర్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కవితను జిల్లా లయన్స్ వైస్ గవర్నర్‌విజయలక్ష్మి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నది.

ధ్యానంతో శాంతి

చేగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం వ్యక్తిగత, ప్రపంచ శాంతికి తోడ్పడుతుందని హార్ట్ ఫుల్‌నెస్ ప్రతినిధి రామ్ నివాజీ అన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు చేగుంట వేంకటేశ్వర ఆలయంలో సామూహిక ధ్యానం చేపట్టి మాట్లాడారు. ధ్యానం వల్ల మానసికోల్లాసంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్‌నెస్ సభ్యులు రష్మిపాండే, కేవీపీఎస్ పద్మావతి, ఆదిశేషు, చేగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ఎంపీవోలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులపై దాడి చేసిన ఎంపీడీవో, ఎంపీవోలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంగ్టి మండలంలో గ్రామపంచాయతీ కార్మికులు మూడు నెలల బకాయి వేతనాలు, సబ్బులు, నూనెలు, బెల్లం ఇతర సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపి ఎంపీడీవో, ఎంపీవోల వద్దకు వెళ్లగా.. జీతాలు లేవు, ఏమి లేవు. ఇష్టముంటే చేయండి లేకుంటే వెళ్లిపోండని దురుసుగా సమాధానమిస్తూ మహిళా కార్మికులపై దాడిచేసి బయటికి గెంటివేయడం దుర్మార్గమన్నారు. ఘటన జరిగి రెండు రోజులైనా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

రక్తదానం ఎంతో గొప్పది



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుమ్మడిదల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో కెల్లా రక్తదానం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వాయిస్ ఆఫ్ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిలాద్ మెగా బ్లడ్ క్యాంపును ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. అలాగే రక్తదాన శిబిరాన్ని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు. గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, సీఐ నయీముద్దీన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి మాతృమూర్తి వజ్రమ్మ ఇటీవల మృతి చెందగా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. స్వర్గస్తురాలైన వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌రెడ్డి సైతం ప్రతాపరెడ్డిని పరామర్శించి, ఆయన తల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయాలపాలై సిద్దిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ చేర్యాల పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే పల్లా ఫోన్‌లో పరామర్శించారు. అధైర్యపడొద్దని, వైద్యం కోసం ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు.

- జగదేవ్‌పూర్/చేర్యాల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి)

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి

కొండపాక , సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం భారతీయ కిసాన్‌సంఘ్ నిరంతర కృషి చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి పేర్కొన్నాడు. ఆదివారం మండలంలోని దుద్దెడ రైతు వేదికలో మండల అధ్యక్షుడు పరశురాములు ఆధ్వర్యంలో మండలస్థాయి భారతీయ కిసాన్ సభ్యుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రతీ సమస్యపై రైతులకు అవగాహన కల్పించి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సిద్ధాంతాలు, సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య విత్తనాల సమస్య, రైతుల సమస్యల పట్ల ముందుండి భారతీయ కిసాన్ సంఘం పోరాడుతుందని తెలిపారు.

ఏ పార్టీలతో సంబంధం లేకుండా రైతు సంఘం ఏర్పడి మన సమస్యలను పరిష్కరించే విధంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రామాలను వచ్చిన ప్రతి గ్రామానికి బాలరాముని భారతమాత ఫొటోలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి రాజిరెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సంపత్ రావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల సిల్వర్‌జూబ్లీ వేడుకలు



ఆత్మీయ సమావేశంలో హుస్నాబాద్ పట్టణప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్సెస్సీ 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థినులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్నందున సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాలాకాలం తర్వాత అందరూ ఒకచోట చేరి కలుసుకోవడంతో పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ కుటుంబ క్షేమసమాచారాన్ని పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో దినమంతా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

చేర్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం తాడూరు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బాలవికాస సంస్థ చేయూతనందించింది. ఈ సందర్భంగా సంస్థ తరఫున రూ.50వేల విలువగల చెక్కును ఆదివారం చైర్మన్ ఆలేరు మల్లయ్య గ్రామపెద్దలకు అందజేశారు.



చెక్కును అందజేస్తున్న బాలవికాస సంస్థ చైర్మన్ మల్లయ్య

రేషన్ బ్యాగులొస్తున్నాయ్

(3వ పేజీ తరువాయి)



ప్రస్తుత ప్రభుత్వం అందించనున్న రేషన్ బ్యాగు, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సంచులు

నిత్యావసరాలు కూడా ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై కొద్ది రోజుల్లో స్పష్టత వస్తుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తాం

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పర్యావరణహితమైన సంచులను అందించనుంది. ఇప్పటికే బ్యాగులు జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేరుకున్నాయి. జిల్లాలో సుమారు 3.25 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే ఈ బ్యాగులను రేషన్ డీలర్లకు, ఆ తర్వాత లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం.

- తనుజ, డీసీఎస్‌వో, సిద్దిపేట

నిత్యావసరాలనూ అందించాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, రేషన్‌తో పాటు నిత్యావసర వస్తువులను కూడా అందించాలి. తక్కువ ధరలకు సరుకులు లభిస్తే సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. అలాగే, దీని వల్ల రేషన్ డీలర్లకు కూడా కమిషన్ రూపంలో ఆదాయం పెరుగుతుంది. కేవలం బియ్యం పంపిణీతో వచ్చే కమిషన్‌తో షాపు కిరాయి, గుమస్తా జీతాలు కూడా సరిపోవడం లేదు. ప్రభుత్వం సంచులతో పాటు నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తే రేషన్ డీలర్లకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నాం.

- వంగరి నాగరాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

నడిమితండాలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాసాయిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నడిమితండాలో చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే తండాలోని పలువురి ఇళ్లను సందర్శించి జ్వరాల బారినపడిన వారి శాంపిల్స్ సేకరించి మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు డాక్టర్ అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎం సంధ్య, వైద్య సిబ్బంది, తండావాసులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కాలనీవాసుల ధర్నా



పాటి గ్రామ రహదారిపై ధర్నా చేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు గుంతలుగా ఉండటం వల్ల నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామానికి చెందిన కాలనీవాసులు చెప్పారు. ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపి మాట్లాడారు. పాఠశాల బస్సులు గుంతల్లోంచి వెళ్లడం వల్ల బస్సులోనే పడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

చెత్త కుండీతో రోగాలు

మనోహరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో చెత్త వల్ల విద్యార్థులు రోగాల బారినపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. పాఠశాల ఆవరణలో చెత్త కుండీని ఏర్పాటు చేశారు అందులో చెత్త వేయడంతో పాటు ఇటీవల కురిసిన వర్షానికి నీరు చేరి దోమలు, పురుగులు వృద్ధి చెందుతున్నాయి. విద్యార్థులకు దోమకాటుతో వైరల్ జ్వరాలు వస్తున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

చేర్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల నూతన కమిటీ కార్యవర్గ ఎన్నిక ఆదివారం చేర్యాల మండలకేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా కర్రెడ్ల రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గందె నర్సింహులు, ఆర్థిక కార్యదర్శిగా బైరిశెట్టి సుధాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీవీ నారాయణ, ఉపాధ్యక్షుడిగా పోలోజు వెంకటాద్రి, ఉపాధ్యక్షురాలిగా వీరబత్తిని యశోద, జాయింట్ సెక్రటరీగా గొట్టం కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యెనమల్ల సుదర్శనం, పబ్లిసిటీ సెక్రటరీగా పిల్లి చంద్రం ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా అమ్మన చంద్రారెడ్డి, ఎన్నికల అధికారిగా రాగుల రాజిరెడ్డి వ్యవహరించారు.

సేవను మించిన మానవీయ గుణం మరొకటి లేదు



ట్రస్ట్ సమావేశంలో మాట్లాడుతున్న హరినాథ శర్మ

కొండపాక, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సేవను మించిన మానవీయ గుణం మరొకటి లేదని విజయదుర్గామాత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చెప్పెల హరినాథశర్మ అన్నారు. ఆదివారం మర్పడగ క్షేత్రంలో జరిగిన ట్రస్ట్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ట్రస్ట్ పక్షాన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొమ్మెర సుదర్శన్ రెడ్డి, మోహన్ దాస్ చీకోటి మల్లికార్జున్ , రాజేంద్రప్రసాద్, మల్లేశం, లగిశెట్టి రాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన జగదేవ్‌పూర్‌లో ఆదివారం చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాగుల రాములుకు చెందిన పాడి గేదె గడ్డి మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు చెప్పాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె

వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమం

గుమ్మడిదల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం గ్రామంలోని ప్రసిద్ధ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం చండీహోమం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వీరభద్రస్వామితో పాటు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్త అశోక్ గౌడ్, పర్యవేక్షకుడు సోమయ్య పాల్గొన్నారు.